వంటగ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

● వామపక్షాల నిరసన

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

నకిరేకల్, ఏప్రిల్ 8 : గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని ఇందిరా గాంధీ సెంటర్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆటోలకు తాళ్లుకట్టి లాగుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సాగర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్వాలా వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు సత్తిరెడ్డి, గజ్జి రవి, అంబటి చిరంజీవి, పీవైఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడోజు వెంకటేశ్వర్లు, బీవీ చారి, అరుణోదయ రాష్ట్ర నాయకులు ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు నరసింహ, అనిల్, సత్తిరెడ్డి, సత్తయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

చిట్యాల : పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో చిట్యాల కనకదుర్గమ్మ సెంటర్‌లో మంగళవారం నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, మండల కార్యదర్శి ఎండీ అక్బర్, నాయకులు బొలుగురి లింగయ్య, ఎస్‌కే షరీఫ్, వెంపటి శ్రీనివాస్, దేశగాని బాలరాజు పాల్గొన్నారు.

కిష్టాపురం వరకు బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు కాల్వ పొడిగింపు

● ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

ఇంజినీర్లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 8 : చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామం వరకు ఉన్న బ్రాహ్మణ వెల్లెంల లెఫ్ట్ మెయిన్ కెనాల్‌ను మునుగోడు మండలం కిష్టాపురం వరకు (11.5 కిలోమీటర్లు) పొడిగించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వను విస్తరించడం ద్వారా మునుగోడు మండలంలో 25 వేల ఎకరాల ఆయకట్టును పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. మునుగోడు మండలంలో వీలైనంత ఆయకట్టుకు నీటిని అందించేలా అంచనాలు రూపొందించి పనులు మొదలుపెట్టాలని ఇంజినీర్లకు సూచించారు. సమావేశంలో ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ విఠలేశ్వర్, ఏఈ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే వీరేశం

రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 8 : పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం మండలంలోని చెర్వుగట్టు గ్రామ రేషన్ దుకాణంలో తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు సట్టు సత్తయ్య, బత్తుల ఉపయ్య, వడ్డె భూపాల్, సాగర్ల సైదులు, రేగట్టె రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నకిరేకల్ : ఐకేపీ కేంద్రాల్లో దాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. నకిరేకల్ మండలంలోని మంగళపల్లి, నోముల, వల్లభాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. మంగళపల్లిలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, ఆర్ఐ చిరంజీవి, ఏఈఓ లింగయ్య, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

● ఎమ్మెల్యే మందుల సామేల్

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శాలిగౌరారం, ఏప్రిల్ 8 : ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండలంలోని గురజాల, తుడిమిడి, చిత్తలూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మధ్యదళారుల చేతిలో మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, తాసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఏఓ సౌమ్య శృతి, ఏపీఎం రాములు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

● ఎమ్మెల్యే బాలూనాయక్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), ఏప్రిల్ 8 : జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1800 కోట్లతో ఏదుల నుంచి డిండి లింక్ ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దాంతో జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు చెందిన మూడున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు, ఆయా గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. ఏదుల నుంచి 2.52 కిలోమీటర్ల ఓపెన్ కాల్వ, 16 కి.మీ. సొరంగం, మరో 3.05 కి.మీ. కాల్వ నిర్మించి దుందుభి నదిలోకి నీళ్లను మళ్లిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజన్, ఇరిగేషన్ సీఈ అజయ్‌కుమార్, దేవరకొండ, కల్వకుర్తి, చండూరు ఆర్డీఓలు రమణారెడ్డి, శ్రీను, శ్రీదేవి, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

● జడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు

కట్టంగూర్, ఏప్రిల్ 8 : మండల పరిషత్ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని జడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. వార్షిక పరిశీలనలో భాగంగా మంగళవారం కట్టంగూర్ ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ప్రణాళికా బద్ధంగా ఖర్చు చేయాలన్నారు. ఖర్చుల వివరాలను పక్కాగా రికార్డు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, ఇన్‌చార్జి ఎంపీఓ చింతమల్ల చలపతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

● కేవీ. రామారావు

సూరేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కేవీ.రామారావు

నిడమనూరు, ఏప్రిల్ 8 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెనిగండ్ల పీఏసీఎస్ చైర్మన్ కేవీ. రామారావు అన్నారు. వెనిగండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రాజన్నగూడెం, సూరేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళి, నాయకులు యడవల్లి వల్లభ్‌రెడ్డి, ముంగి శివమారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, నందికొండ మట్టారెడ్డి, మజ్జిగపు దయాకర్‌రెడ్డి, సంకూరి రాంబాబు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి : వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి, ఏప్రిల్ 8: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు చేయడంతో పాటు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్ మమతను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ భవనం పురాతనమైందని, కొత్త భవనం మంజూరు చేయాలని, ప్యూరిఫైడ్ యంత్రం పని చేయడం లేదని, డెలివరీ చేసేందుకు టేబుళ్లు, ఆటో క్లేవ్స్ వంటి పరికరాలు కావాలని డాక్టర్ మమత విజ్ఞప్తి చేయగా స్పందించిన కలెక్టర్ వాటిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను, లైబ్రరీని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఎలా చదువుతున్నారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని, ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆమె వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, తాసీల్దార్ పరుశురామ్, అధికారులు ఉన్నారు.

లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన కలెక్టర్

మిర్యాలగూడ(మాడ్గులపల్లి) : మాడ్గుల పల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో సన్న బియ్యం పథకం లబ్ధిదారు జానకమ్మ ఇంట్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, జిల్లా పౌరసరఫరాల ఇన్‌చార్జి అధికారి హరీశ్‌కుమార్‌తో కలిసి రేషన్ దుకాణాల ద్వారా అందించిన సన్నబియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సన్న బియ్యాన్ని సక్రమంగా సరఫరా చేసేందుకు జిల్లాలోని వెయ్యి రేషన్ షాపులకు పూర్తిస్థాయిలో బియ్యాన్ని సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రతి పేద కుటుంబానికి చేరాలనేదే తమ లక్ష్యమన్నారు. అంతకుముందు కలెక్టర్ పాములపాడు పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్య సేవల గురించి డాక్టర్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తాసీల్దార్ సురేశ్, ఎంపీడీఓ తిరుమలస్వామి, వైద్యాధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

13న ట్యాంక్ బండ్‌పై వక్ఫ్ మార్చ్

మిర్యాలగూడ, ఏప్రిల్ 8: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 13న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై జరిగే వక్ఫ్ మార్చ్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ ఖలేదా సైపుల్లా కోరారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. వక్ఫ్‌బిల్లుపై కులమతాలకు అతీతంగా పోరాడాలన్నారు.మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సిరాజుద్దీన్, నల్లగొండ జిల్లా చైర్మన్ ఎంఏ.సలీం, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు

● ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

మర్రిగూడ, ఏప్రిల్ 8 : రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వీయ రక్షణపై అవగాహన

మర్రిగూడ, ఏప్రిల్ 8 : మండలంలోని దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వీయ రక్షణపై హెచ్ఎం ఉదావత్ లచ్చిరాం అవగాహన కల్పించారు. మంగళవారం పాఠశాల తరగతి గోడపై స్వీయ రక్షణకు సంబంధించిన అంశాలతో పొందుపర్చిన బోర్డును ఆయన ఏర్పాటు చేయించారు. ఉపాధ్యాయులు కొండా శ్రీనివాస్, వై.మంజులత పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయాలని విద్యార్థుల ఆందోళన

గట్టుప్పల్, ఏప్రిల్ 8 : మండలంలోని అంతంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థులు మంగళవారం పాఠశాల గేటు ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పాఠశాలకు వచ్చే రోడ్డు సరిగా లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు సీసీరోడ్డు నిర్మించాలని కోరారు.

గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

చిట్యాల, ఏప్రిల్ 8 : గురుకుల ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి సీట్లు సాధించిన వట్టిమర్తి గ్రామానికి చెందిన 11 మంది విద్యార్థులను మంగళవారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరి కృష్ణ సన్మానించారు. ఈ సందర్భంగా హరి కృష్ణ మాట్లాడుతూ మొత్తం 15 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 11 మంది సీట్లు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.జానకి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి రవీంద్రకుమార్ పరామర్శ

శక్రునాయక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట, ఏప్రిల్ 8 : చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నున్సావత్ పార్వతీచందునాయక్ తండ్రి శక్రునాయక్ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ గ్రామానికి వెళ్లి శక్రునాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కేతావత్ బిల్యానాయక్, కిషన్‌నాయక్, లోక్యనాయక్, శంకర్‌నాయక్, తరిగోవర్ధన్, పాపానాయక్, వడ్త్య బాలు, కేతావత్ హరిలాల్ ఉన్నారు.

అర్హులైన రైతులకు త్వరలో పట్టాలు

● ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 8: అర్హులైన రైతులకు త్వరలో పట్టాలు అందిస్తామని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరులగిరి(సాగర్) మండలంలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన భూముల సర్వేపై మంగళవారం అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ సర్వే స్పిబందితో ప్రభుత్వ భూముల ఎంజాయ్‌మెంట్ సర్వే చేసినట్లు తెలిపారు. తిరుమలగిరి(సాగర్) మండలంలోని 13 గ్రామాలకు సంబంధించి ప్రభుత్వ భూముల్లో కాస్తు కబ్జా కలిగి సేద్యం చేయడానికి అర్హత కలిగిన 4500 మందికి 4వేల ఎకరాలకు లావుని పట్టాలు జారీ చేసేందుకు కమిటీ ఆమోదించినట్లు పేర్కొన్నారు. త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో తాసీల్దార్లు, పైలట్ ప్రాజెక్టు టీం లీడర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 8: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో కార్మికులు బాధ్యతగా వ్యవహరిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. కార్మికులకు పెండింగ్ వేతనాలు, ఇతర బిల్లులు అందేలా కృషి చేస్తానన్నారు. అనంతరం కార్మికులకు కాస్మోటిక్స్ కిట్స్ అందించారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

● మాజీ జడ్పీటీసీ సైదులు గౌడ్

ధాన్యాన్ని పరిశీలిస్తున్న తండు సైదులు గౌడ్

తిప్పర్తి, ఏప్రిల్ 8: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా కాంటాలు పెట్టకుండా రైతులను ఇబ్బదులకు గురిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించక పోతే బుధవారం రైతులతో కలిసి హైవేను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కందుల లక్ష్మయ్య, సైదులు, గుండు రవి, శ్రీనివాస్‌రెడ్డి, సైదిరెడ్డి రైతులు ఉన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు : ఎస్ఐ

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 8 : రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దని కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ధాన్యం రోడ్లపై ఆరబోయడం వల్ల వాహనదారులు గమనించక, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు.

నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలి

● డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 8 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మునుగోడు మండలంలోని మునుగోడు, కొరటికల్, గూడపూర్, పులిపలుపుల, ఊకోండి, కచలాపురం గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, నాయకులు పాల్వాయి చెన్నారెడ్డి, భీమనపల్లి సైదులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ముడిమళ్ల బుచ్చిరెడ్డి, బిట్టు రవికుమార్, మర్ల చంద్రారెడ్డి, అల్లంపల్లి జానయ్య, అంబటి సోమయ్య, రాంబాబు, అనంతరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

యాచారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ సరిత

నార్కట్‌పల్లి : మండలంలోని కొండపాకగూడెం, ఔరవాణి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాసీల్దార్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

యాచారంలో ..

హాలియా : అనుముల మండలంలోని యాచారం గ్రామంలో రైతు స్వయంకృషి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి సరిత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అరవింద్, ఎఫ్‌పీఓ డైరెక్టర్లు కాసాని జానయ్య, చెదురుబెల్లి రాములు, సీఈఓ ఎం.నర్సింహ, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే పేదలకు సన్నబియ్యం

● శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల, ఏప్రిల్ 8 : ప్రజల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన స్వగ్రామమైన మండలంలోని ఉరుమడ్లలో సన్న బియ్యం లబ్ధిదారుడు జనార్దన్ ఇంట్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి రేషన్ బియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డు బియ్యం సరఫరా చేసినప్పుడు లబ్ధిదారులు వాటిని ఇతరులకు అమ్ముకుని ఎక్కువ ధర భియ్యం కొనుగోలు చేసే వారని, ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడం వల్ల పరిస్థితులలో మార్పు వస్తుందన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలోని అన్ని సమస్యలు పరిష్కరించినట్లు వివరించారు. ఇటీవల ఎస్‌డీఎం పథకం కింద సీఎం ఆరున్నర కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, నార్మాక్ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, నాయకులు కాటం వెంకటేశం, ఎడ్లపురి కృష్ణ, బట్టు అయిలేశ్, గుడిపాటి లక్ష్మీనర్సింహ, వెంకటేశ్వర్లు, యాదగిరి, బుద్దుడు పాల్గొన్నారు.

ఎన్‌జీ క్రీడామైదానంలోంచి డ్రైనేజీ నిర్మించొద్దు

● కళాశాల ప్రిన్సిపాల్‌కు బీఆర్ఎస్వీ వినతి

ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామగిరి, ఏప్రిల్ 8: నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలోని క్రీడా మైదానం లోంచి డ్రైనేజీ నిర్మాణం చేపట్ట వద్ద కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్‌కు మంగళవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీను ఆధ్వర్యంలో విద్యార్థులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కట్టా శ్రీను మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కళాశాల మైదానం ఆక్రమణకు గురవుతుందన్నారు. చుట్టుపక్కల కాలనీకి చెందిన డ్రైనేజీ నిర్మాణం కళాశాల మైదానంలోని వాకింగ్ ట్రాక్ పక్కనే చేపడుతున్నా కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. డ్రైనేజీ నిర్మిస్తే క్రీడా మైదానంలో మురుగు నీరు చేరే ప్రమాదం ఉందని తెలిపారు. తక్షణ